క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలన్నారు.

తాగునీటి సమస్య తీరింది



సాక్షి ఎఫెక్ట్

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామ పంచాయతీ కుళాయిల్లో వారం రోజులుగా మురికి నీరు సరఫరా అవుతున్న దృష్ట్యా 'గ్రామ పంచాయతీ కుళాయిల్లో మురికినీరు' శీర్షికన ఈనెల 29వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకులలో, సంపులలో ప్రజలకు సరఫరా చేసే నీటికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. మురుగునీరు రాకుండా కట్టడి చేశారు. తాగునీటిలో ఉండాల్సి మినరల్స్ సరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. బుధవారం సాయంత్రం నుంచి గ్రామస్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందిస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్ వద్ద మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయలపాలైన వ్యక్తి నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడు మాసిపోయిన నలుపు టీషర్ట్, జీన్‌ప్యాంటు ధరించి గడ్డంతో ఉన్నాడు. వయస్సు 60కి పైగా ఉంటుందని అతని ఆనవాళ్లకు బట్టి యాచకుడు అయి ఉంటాడన్న సందేహం వ్యక్తమవుతుందన్నారు. మృతదేహం నరసరావుపేట ఏరియా మార్చురీలో ఉందని ఆచూకీ తెలిసిన వారు 9440796246 నంబరుకు తెలియజేయాలని ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

కాప్స్ రాక్స్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా యర్రంశెట్టి



నకరికల్లు: పల్నాడు జిల్లా కాప్స్ రాక్స్ కో–ఆర్డినేటర్‌గా నకరికల్లుకు చెందిన యర్రంశెట్టి మల్లిఖార్జునరావు నియమితులైనట్లు కాప్స్ రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి శివభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు సామాజిక వర్గ అభివృద్ధికి కాప్స్‌రాక్స్ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానని అన్నారు. ఫౌండర్ శివభాస్కర్, జిల్లా కె.ఆర్.అడ్మిన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

గురజాల: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జీవీసీ కాలనీలోని బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం మండల లీగల్ సెల్ అథారిటీ కమిటీ చైర్మన్ ఆర్.శరత్ బాబు ఆదేశాల మేరకు ప్రపంచ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అవగాహన విషయాలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, కత్తి చలమరాజు, సీనియర్ న్యాయవాది కె.ప్రభుదాసు తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

పిడుగురాళ్ల: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ టి.ప్రవళిక అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బార్ అసోసియేషన్ సహకారంతో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. మోసపూరిత ట్రాఫికింగ్ ముఠా చేతిలో చిక్కకుండా జాగ్రత్తగా ఉండాలని, యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని, సరైన ప్రణాళికతో లక్ష్యసాధనతో విద్యార్థులు విజయపథంలో దూసుకుపోవాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కోవూరి వెంకటేశ్వర్లు, ప్యానెల్ న్యాయవాదులు పి.మాణిక్యం, ప్రశాంత్‌నాయక్ పాల్గొనారు.

డ్రెయిన్లు.. దోమల నిలయాలు

- పారుదల లేని డ్రెయిన్లతో తిప్పలు
- పెరిగిన దోమల మోత
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు



సత్తెనపల్లి అచ్చంపేటరోడ్డులోని డ్రెయిన్ దుస్థితి

సత్తెనపల్లి: వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపం వెరసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురుగు ముందు కదలక కంపు కొడుతోంది. ఎక్కడికక్కడ దోమల వృద్ధి పెరిగిపోతుంది. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నా ఎక్కడా ఆ ఆనవాళ్లు లేవు. జిల్లాలో పారిశుద్ధ్య పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతుంది.

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా..

డ్రైనేజీలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ కోసం గంబుషియా చేపల వదలడం సైతం అధికారులు విస్మరించారు. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దోమల మోత పెరిగిపోతుండడంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతుంది. దీనికి తోడు పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు దోమల బెడద నుంచి ఉపశమనం పొందేందుకు జెట్ కాయిల్స్, లిక్విడ్ వినియోగిస్తున్నారు. ఇంటి బడ్జెట్‌లో అదనంగా ఈ వ్యయం పెరుగుతోంది. తమ నుంచి పన్నులు వసూలు చేసే అధికారులు మాత్రం దోమల నివారణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు మండి పడుతున్నారు.

ఆడ దోమలే వ్యాధులకు మూలం

ఆడదోమలతోనే అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. ఆడ అనాఫిలస్ దోమ మలేరియాను, ఆడ క్యూలెక్స్ దోమ ఫైలేరియా, మెదడువాపు, ఏడిస్ ఈజిప్ట్ దోమ ఎల్లో ఫీవర్, డెంగీ జ్వరం, చికున్ గున్యాను వ్యాపింపజేస్తున్నాయి. శరీరంపై రక్తం పీల్చుతూ అంటువ్యాధులకు కారణమవుతున్నాయి. ఇవి మనుషులు, జంతువుల రక్తం సునాయాసంగా పీల్చేస్తాయి. ఆడ దోమ 100 రోజులు బతికితే, మగ దోమ 10–20 రోజుల్లోపు చనిపోతుంది.

ఇలా చేస్తే మేలు....

- రాత్రిళ్లు ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పకుండా వాడాలి. దోమలు దగ్గరకు రాకుండా ఉండేందుకు ఇటీవల మార్కెట్లోకి క్రిమిసంహారక మందుతో తయారు చేసినవి అందుబాటులోకి వచ్చాయి.
- నివాస స్థలాల నుంచి దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తపడాలి. కిటికీలు, తలుపులకు మెష్ అమర్చుకోవాలి.
- దోమల సంతతి అధికంగా ఉండే ప్రాంతాల్లో చర్మం కప్పి ఉంచేలా పొడవైన షర్టులు, నైట్ ప్యాంట్లు ధరించాలి. శరీరం వాటికి కనిపించకుండా జాగ్రత్తపడాలి.
- ఇంటి చుట్టూ ఉండే పూల కుండీలు, బకెట్లలో క్రమం తప్పకుండా నీటిని మార్చాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలి.
- ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డేగా పాటించాలి.
- చెత్తా చెదారాన్ని మురికి కాలువల్లో వేయరాదు
- మరుగుదొడ్ల గాలి గొట్టాలకు మెష్ కట్టుకోవాలి
- జ్వరం వచ్చిన తక్షణమే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు

పెరికపాడులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'



ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెరికపాడు(క్రోసూరు): మండలంలోని పెరికపాడు గ్రామంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం పార్టీ మండల కన్వీనర్ వెలది అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను ఏవిధంగా మోసం చేస్తున్నారో ఇంటింటికీ వెళ్లి వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500పై ఇంతవరకు అతీగతి లేదన్నారు. నిరుద్యోగభృతిపై కూటమి నేతలు నోరు మెదపడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ అమలు చేయకుండా రైతులను నిలువునా మోసం చేశారన్నారు. అరకొరగా అమలు చేసిన తల్లికి వందనం అర్హులైన తల్లులు ఎందరికో అందలేదన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే జగనన్న నాయకత్వంలో పార్టీని, జగనన్నను తిరిగి అధికారంలోకి తీసుకొద్దామని వివరించారు. ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, మాజీ మండల కన్వీనర్ సయ్యద్ అబ్దుల్ రహీం, మాజీ సొసైటీ అధ్యక్షుడు అనుమల కోటిరెడ్డి, లేళ్ల చిరంజీవి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, బూక్యా కామేశ్వరీ బాయి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలతో కలిసి వెళ్తేనే రాజ్యాధికారం

- ఆ దిశగా ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగేందుకు యత్నించాలి
- లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న చందోలు సత్య నారాయణ

సత్తెనపల్లి: ఆర్య వైశ్యులు వ్యాపారంతో పాటు రాజకీయంగా కూడా బలోపేతం కావాలని లోక్ జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ పిలుపునిచ్చారు. విజయవాడ నుంచి పిడుగురాళ్ల వెళ్తూ మార్గం మధ్యలోని సత్తెనపల్లిలో బుధవారం కొద్దిసేపు ఆగిన ఆయన ఆర్యవైశ్యులతో నాయకులతో మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఎస్సీ, ఎస్టీ వర్గాలను కలుపుకొని వెళ్తేనే అధికారం దిశగా పయనిస్తారని, అగ్రవర్ణాల పార్టీలలో ఆర్యవైశ్యులు పనిచేయటం వృథా ప్రయాసన్నారు. రాజకీయంగా ఎదగాలంటే అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీలతో కలిసి వెళ్తేనే రాజ్యాధికారం దిశగా పయనిస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలకు కూడా ఆయా వర్గాలే అండ అని, ఆర్యవైశ్యులు కూడా ఎస్సీ,ఎస్టీలతో కలసి రాజకీయంగా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య నాయకులు ఆయన ఘనంగా సన్మానించారు. పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్ కుమార్, నాయకులు మహంకాళి వెంకటరావు, కారుమంచి గంగరాజు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు), ఆర్యవైశ్య నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ



సబ్సిడీపై కంది, మినుము, వరి విత్తనాలు అందచేస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏఓ

క్రోసూరు: మండలంలోని నాగవరం, హసనాబాద్ గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ పాల్గొని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల వివరాలను తెలియజేసారు. సీఆర్సీ కార్డులు కావలసిన కౌలు రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని గానీ, గ్రామ రెవెన్యూ అధికారిని గాని సంప్రదించి పొందాలని సూచించారు. ఈసందర్భంగా పాటిబండ్ల హసన్ సుభాని అనే కౌలు రైతుకు సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్సీ) కార్డును అందజేసారు. పంటల బీమా పథకం పత్తి, కంది, మిరప పంటలకు జూలై 31వ తేదీ వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు గడువు ఉన్నందున రైతులు ఈ గడువులోగా సీఎస్‌సీ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ఈసందర్భంగా రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది రకం ఎల్‌ఆర్జీ– 52, మినుము రకం టీబీజీ, వీబీఎన్–8 , సబ్సిడీపై వరి రకం బీపీటీ 5204 లను అందజేసారు. అనంతరం గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను రైతులతో కలిసి పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఏఓ వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ చిరంజీవి రామాంజనేయులు, ఎర్రంశెట్టి రామకృష్ణ, రైతుసేవాకేంద్ర సిబ్బంది షేక్ రూబియా బేగం,రైతులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: వివిధ పంటలను సాగు చేసే రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు అన్నారు. సత్తెనపల్లి, వడ్డవల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ వరి పంటకు ఇన్సూరెన్స్ ఆఖరు తేదీ ఆగస్టు 15తో ముగుస్తుందన్నారు. మిగతా పత్తి, మిరప, కంది, మినప పంటలకు ఇన్స్యూరెన్స్ గడువు ఈ నెల 31 తో ముగుస్తుందన్నారు. సత్తెనపల్లి ఏఓ బి.సుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం కింద కంది, మినప విత్తనాలు చిరు సంచులు పంపిణీ చేశారు. ఏఈఓ జె.యేసోబు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నకరికల్లు: రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలో వరి విత్తనాలకు రాయితీపై రైతులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎన్ఎం–1638 రకం వరి విత్తనాలు కేజీ రూ43లు కాగా రూ5లు రాయితీపై రూ38ల చొప్పున 25 క్వింటాళ్ల విత్తనాలను గ్రామంలోని రైతులకు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో డీలర్‌ల సమావేశం నిర్వహించారు. ఏడీఏ రవిబాబు, ఏఓ కె.దేవదాసు, వ్యవసాయ సహాయకులు పి.పవన్‌కుమార్, కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్‌రెడ్డి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి: సత్ప్రవర్తనతో మెలిగి భవిష్యత్తులో నేర ప్రవృత్తి లేకుండా జీవించాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును బుధవారం సందర్శించిన ఆయన ముందుగా ఉపకారాగారంలో పరిసరాలను పరిశీలించి అనంతరం అక్కడ ఉన్న రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహారం నాణ్యత, వసతులు గురించి అడిగి తెలుసుకొన్నారు. వారు ఏ ఏ కేసుల్లో రిమాండ్‌లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకొనే స్థోమత లేని వారికి ఉచిత న్యాయసహాయం అందిస్తామన్నారు. ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, ఉపకారాగార సూపరింటెండెంట్ వెంకటరత్నం, కోర్టు సిబ్బంది, రిమాండ్ ముద్దాయిలు ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు ఎంపీయూపీ పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్ పాల్గొని పౌరహక్కులకు భంగం కలిగేలా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమని, ఎవరూ హక్కులకు భంగం కలిగించకూడదన్నారు. పౌరహక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌరహక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కుల వివక్షను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్.ఐ ఆంజనేయులు, వీఆర్వో బి.దాసు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి

రాజుపాలెం: గ్రామాల్లో జరిగే పనులకు కొంతమంది ప్రజా ప్రతినిధులను ఆహ్వానించడం లేదని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు కొంతమంది ప్రజా ప్రతినిధులపై పక్షపాత ధోరణి వహిస్తున్నారని, అలాంటి వారిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల గురించి సంబంధిత ఏపీఓ, వెలుగు కార్యాలయ ఏపీఎంలకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయడం లేదన్నారు. కొందరు అధికారులకు ప్రజాప్రతినిధులంటే లెక్కలేదని ధ్వజమెత్తారు. అదే విధంగా రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ప్రొటోకాల్ పాటించడంలేదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరినీ ఆహ్వానించే విధంగా అధికారులకు తెలియపరుస్తానని, మళ్లీ ఇటువంటి పొరపాటు జరగవని తెలిపారు. ముందుగా మండలస్థాయి అధికారులువారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తహసీల్దార్ సరోజిని, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈఓ–1,2 మల్లిఖార్జునశర్మ, నరసింహారావు, మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ముప్పాళ్ళ: రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన రక్తదాన శిబిరం జరుగుతుందని తహసీల్దార్ కె.నగేష్ బుధవారం తెలిపారు. ఉదయం 9:30ని.ల నుంచి క్యాంపు జరుగుతుందని, మండల పరిధిలోని అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆసక్తి కలిగిన యువత ఈ క్యాంపులో పాల్గొనవచ్చన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది వీరయ్య



ముద్దూరు డౌన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం

పెదకూరపాడు (అచ్చంపేట): మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామంలో మానవ అక్రమ రవాణా అవగాహన సదస్సును స్థానిక ఎస్సీ కాలనీ ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. న్యాయవాది వీరయ్య మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పెద్దలు, మహిళలు, పిల్లల అక్రమ రవాణా జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో ఎక్కువుగా హాస్పిటల్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల వద్ద ఒంటరిగా ఉన్న పిల్లల్ని కొంతమంది గుర్తించి వారికి మత్తు పదార్థాలు ఇచ్చి రాష్ట్రాలు దాటిస్తున్నారన్నారు. పాఠశాలలకు పంపించే చిన్నారులను కనిపెడుతూ ఉండాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట మండల పారాలీగల్ వలంటీర్ శిఖా తిమోతి, రాజుపాలెం పారాలీగల్ వలంటీర్ యోహాన్ రాజు, బెల్లంకొండ పారాలీగల్ వలంటీర్ కొమ్ము వెంకటరావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా మానవహారం..

అమరావతి: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పల్లోటి జూనియర్ కాలేజీ సెయింట్ అగస్టీన్ స్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ముద్దూరుడౌన్ సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకు మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముద్దూరు డౌన్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనే సాంఘిక దురాచారాన్ని అరికట్టటానికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటుగా ప్రజలు కూడా సహకరించాలన్నారు. మానవఅక్రమ రవాణా సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్లకు 1098, 181, 100 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. బత్తుల బాబు, సిస్టర్ యాంటోలతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి




మన్నవ మోహనకృష్ణతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడేవారు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు మందడి శ్రీహరిచే బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమెరికా తెలుగు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మందడి శ్రీహరిని సత్కరించారు. నాట్స్ చైర్మన్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

- సత్తెనపల్లి మండలం గుడిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గద్దె అప్పారావు, మెంబర్లుగా పురం మరియదాసు, గుంటుపల్లి బొల్లయ్యలు బుధవారం నిర్వహించిన ప్రమాణస్వీకారం మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కవి రవికుమార్‌కు సాహితీ పురస్కారం



దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయుడు కోసూరు రవికుమార్‌కు సాహితీ పురస్కారం దక్కింది. రవికుమార్ రాసిన దాపల కవిత్వ సంపుటికి ఈ పురస్కారం వరించింది. ఖమ్మంలోనే హాసిని రామచంద్ర లిటరసీ ఫౌండేషన్ నిర్వాహకులు, సాహితీవేత్త అబ్దుల్ రాజా హుస్సేన్ ఈ కవిత్వానికి ద్వితీయ స్థానాన్ని ప్రకటించారు. దీంతో ఆగస్టు 17వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కవి రవికుమార్ పురస్కారాన్ని అందుకోనున్నారు.

కుంకలగుంటలో కార్డెన్ సెర్చ్

36 ద్విచక్ర వాహనాలు, ఆయుధాలు స్వాధీనం

నకరికల్లు: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలు, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్నవారిపై, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కుంకలగుంటలో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలు, 10 కత్తులు, 2 గొడ్డళ్లు, ఒక గడ్డ పలుగును స్వాధీనం చేసుకున్నామన్నారు. రాబోయే వినాయకచవితిని గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని, అలజడులు, అల్లర్లు సృష్టిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. తనిఖీల్లో పెదకూరపాడు, అమరావతి, సత్తెనపల్లి టౌన్, రూరల్ సీఐలు పి.కిరణ్, సురేష్, అచ్చయ్య, నకరికల్లు ఎస్‌ఐ చల్లా సురేష్, పెదకూరపాడు, క్రోసూరు, ముప్పాళ్ల, అచ్చంపేట, రాజుపాలెం, సత్తెనపల్లి టౌన్, రూరల్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

